## 30న 'బీసీ కమిషన్' రాక

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 26: బీసీ కమిషన్ సభ్యులు ఈ నెల 30న జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తిగల ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా ఈ బృందం జిల్లాకు వస్తున్నట్టు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఈ నెల 30న ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లో బీసీ కషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వేల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వకంగా, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని తెలిపారు. అభ్యర్థనలతోపాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్లం లో ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్షాలను సంబంధిత కేసుల వివరాల సమర్పణలను కమిషన్‌కు నివేదించవచ్చని సూచించారు.

# ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

**ఎస్పీ చెన్నూరి రూపేశ్**

సంగారెడ్డి, అక్టోబరు 26: అమరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21నుంచి 31 వరకు ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం, ఓపెన్ హౌస్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు తెలంగాణ పోలీసు ఉన్నతాధికారి డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రాల్లో నిర్వహించారు. రక్తదాన శిబిరంలో ఎస్పీతోపాటు సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాం చేయడం సంతోషకరమన్నారు. ఈ శిబిరంలో 61యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు.

***ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన***

పోలీసుశాఖ పని తీరు, జిల్లా ప్రజల రక్షణలో పోలీసుశాఖ అవలంభిస్తున్న విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు పోలీసు పరేడ్ మైదానంలో పోలీసు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, ట్రేడింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930కు కాల్ చేయాలని, లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రామ్మోహన్‌రెడ్డి, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, జ్యోతి, ఎస్‌బీ సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్‌బీ ఎస్ఐ యాదవరెడ్డి, ఆర్ఐలు రామారావ్, రాజశేఖర్‌రెడ్డి, డానియేల్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

## రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కంది, అక్టోబర్ 26: ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చీఫ్ క్వాలిటీ కంట్రోలింగ్ అధికారి రామకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కంది మండల పరిధిలో 2023-24 సంవత్సరానికి చేపట్టిన ఉపాధి హామీ పనుల రికార్డులను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పరిశీలించారు. కొలతలకు అనుగుణంగా పేమెంట్ చేయాలని, పనుల నిర్వహణలో అలసత్వం వహించారదని ఆదేశించారు. లోటుపాట్లు రికార్డులు సరిగా మెయింటేన్ చేయాలని, తప్పులతడకగా నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం మక్తఅల్లూర్ గ్రామాన్ని సందర్శించారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ క్వాలిటీ కంట్రోలింగ్ అధికారి శ్రీలత, జూనియర్ క్వాలిటీ కంట్రోలింగ్ అధికారి సుభాష్, ప్రోగ్రాం అధికారి రఘువీర్, ప్రాజెక్ట్ అధికారి బాలరాజు, ఎంపీడీఓ శ్రీనివాస్, మండల ప్రోగ్రాం అధికారి గురుపాదం పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న అధికారి రామకృష్ణ

## ఎర్రజెండా వైపు ప్రపంచం చూపు

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

సంగారెడ్డి, అక్టోబర్ 26: ప్రపంచమంతా ఎర్రజెండా వైపు చూస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పీఎస్ఆర్ గార్డెన్‌లో రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశంలో హిందుత్వ స్థాపనే లక్ష్యంగా బీజేపీ పని చేస్తున్నదని, దేశం వేల సంఖ్యలో కులాలుగా విభజించబడి ఉన్నదన్నారు. కార్యక్రమంలో వీరయ్య, చుక్క రాములు, జిల్లా కార్యదర్శి జయరాజు, నర్సింహరావు, మల్లికార్జున్, మల్లారెడ్డి, మల్లేశం, మూడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లేశం, రాజయ్య, రామచంద్రం, మాణిక్, నర్సింహులు, గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, చంద్రారెడ్డి, నర్సమ్మ, మల్లేశం బసవరాజు, లలిత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

## ఆక్రమణలను అడ్డుకోవాలి

జిన్నారం, అక్టోబర్ 26: అండూరు గ్రామంలోని సర్వే నంబర్ 118లో పంట పొలాల నడుమ పరిశ్రమ పేరుతో అక్రమంగా జరుగుతున్న నిర్మాణాన్ని ఆపాలంటూ గ్రామస్తులు శనివారం ఆందోళన చేపట్టారు. గ్రామసభ ఏర్పాటు చేయకుండా, గ్రామస్తుల అనుమతి లేకుండానే పంచాయతీ కార్యదర్శి అండతో పంట పొలాల మధ్య నిర్మాణాలు చేపడుతున్నారని పనులను అడ్డుకున్నారు. అండూరు గ్రామం పూర్తిగా వ్యవసాయ ఆధారితమైనదని, గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయం తీసుకోవాలన్నారు. అక్రమ నిర్మాణాలపై జిల్లా, మండల అధికారులు విచారణ జరిపాలని, అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న పంచాయతీ సెక్రటరీని సస్పెండ్ చేయాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీని సంప్రదించగా నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

## అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే

నిజాంపేట్, అక్టోబర్ 26: బీఆర్ఎస్ నాయకుడి అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మండ ల కేంద్రమైన నిజాంపేట్ గ్రామానికి చెందిన సంగోని సాయాగౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న భూ పాల్ రెడ్డి శనివారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ వైస్ ఎం పీపీ సాయిరెడ్డి, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు రాంచందర్‌పాటిల్, కిష్టారెడ్డి, భాస్కర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మక్బుల్, లింగాగౌడ్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

కోహీర్, అక్టోబర్ 26: మండలంలోని బిలాల్‌పూర్‌లో తొమ్మిది మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశామని ఎస్సై గోపతి సతీశ్ తెలిపారు. శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని చెప్పారు. తొమ్మిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6 వేలు, 7 బైకులు, 7 సెల్ ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

## కాంగ్రెస్ నేతలవి తప్పుడు ఆరోపణలు

బొల్లారం, అక్టోబర్ 26: తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం బొల్లారంలో ఆయన మాట్లాడుతూ.. హైడ్రా అంశంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు కావాలనే దురుద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజులుగా పలు కాలనీల్లో హైడ్రా అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిలో మార్కింగ్ చేసిన అంశాన్ని ఉద్దేశపూర్వకంగా తనపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కుంటల్లో పేద ప్రజలు నిర్మించుకున్న గృహాలను కూల్చివేయాలని, తన పేరుతో హైడ్రా కార్యాలయంలో లేఖ ఇవ్వడమే కాకుండా తప్పుడు ప్రచారానికి తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన లేఖను కౌన్సిలర్లతో కలిసి ప్రదర్శించారు. ఈ వ్యవహారంపై ఉపేక్షించేది లేదని, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లతో కలిసి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు శ్రీకాంత్‌యాదవ్, బీరప్పయాదవ్, ప్రభు నాయక్, మాజీ ఎంపీటీసీ రత్నం పాల్గొన్నారు.

ఫిర్యాదు లేఖను చూపుతున్న బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి

## పలు ప్రైవేట్ క్లినిక్‌ల సీజ్

గుమ్మడిదల, అక్టోబర్ 26: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దవాఖానలను వైద్యాధికారులు సీజ్ చేశారు. శనివారం మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్, ఎంపీహెచ్ఓ శ్రీనివాసరావు సంయుక్తంగా ప్రైవేట్ క్లినిక్‌ను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లను సీజ్ చేశారు. గుమ్మడిదలలో ప్రభు ఫస్ట్ ఎయిడ్ సెంటర్, బొంతపల్లిలో వేణుగోపాలరావు ఫస్ట్ ఎయిడ్ సెంటర్, దోమడుగులో పీఆర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, చికిత్స ఫస్ట్ ఎయిడ్ సెంటర్, అన్నారంలో బీపీఎల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండటంతో మండల వైద్యాధికారి డాక్టర్ మధుకర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లను పరిశీలించి సీల్ చేసినట్టు తెలిపారు. మండలంలో ఎవరైనా ప్రైవేట్ క్లినిక్‌లో చట్ట విరుద్ధంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే క్రిమినల్ కేసులు చేస్తామని హెచ్చరించారు.

దోమడుగులో ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న మండల వైద్యాధికారులు

## కొత్త ఇండ్లకు నంబర్లు తప్పనిసరి

రాయికోడ్, అక్టోబర్ 26: గ్రామాల్లో ఇటీవల నిర్మించిన ఇండ్లకు తప్పకుండా ఇంటి నంబర్లు వేసుకోవాలని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో 10,500 ఇండ్లను ప్రభుత్వం గుర్తించి నంబర్లు వేసినట్లు తెలిపారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన ఇండ్ల గురించి పంచాయతీ కార్యదర్శికి తెలిపి కొత్త ఇంటి నంబర్ వేసుకోవాలని సూచించారు. ఇంటి నంబర్ ఉంటేనే త్వరలో జరిగే సర్వే చేస్తామని తెలిపారు. సమావేశంలోఎంపీవో అంజలిదేవి ఉన్నారు.

## జేఎన్‌టీయూలో రక్తదానం

విద్యార్థినికి ధ్రువపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

చౌటకూర్, అక్టోబర్ 26: సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్, సంగారెడ్డి ప్రభుత్వ దవాఖాన, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 107 మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొన్నారు.

## ఏహెచ్ పీఎస్ విద్యార్థులకు పతకాల పంట

అమీన్‌పూర్, అక్టోబర్ 26: జాతీయస్థాయిలో అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ 11వ మెగా కాంపిటీషన్స్‌లో అమీన్‌పూర్ బీరంగూడ అకడమిక్ పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో సత్తా చాటారని బీరంగూడ పాఠశాల నిర్వాహకుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ నెలలో ఏహెచ్‌పీఎస్ 11వ మెగా కాంపిటీషన్ పోటీల్లో బీరంగూడ పాఠశాల నుంచి 103 మంది విద్యార్థులు పాల్గొనగా 25 స్వర్ణ పతకాలు, 26 వెండి, 28 రజిత పతకాలు సాధించినట్లు తెలిపారు. పోటీల అనంతరం భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిని సైనా నెహ్వాల్ చేతుల మీదుగా పథకాలు అందుకున్నట్లు చెప్పారు. బీరంగూడ పాఠశాలలో శనివారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు పరిమళ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పతకాలను సాధించిన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

## నేడు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

అందోల్, అక్టోబర్ 26: జోగిపేట మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం కొలువుదీరనుండగా.. ప్రమాణస్వీకారానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసినట్లు చైర్మన్ మక్త జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం మధ్యాహ్నం జోగిపేటలోని శ్రీరామ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రితోపాటు ఎంపీ సురేశ్‌షెట్కార్, ఇతర ఎమ్మెల్యేలు, ప్రముఖులు హాజరవుతారన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఉంటుందని, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పద్మనాభ రెడ్డి, నాయకులు మధుసుదన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి, జోగిపేట ఏఎంసీ చైర్మన్

## పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 26: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని ఉద్యానవన అధికారి సునీతారోస్ అన్నారు. తారా ప్రభుత్వ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం 'సరైన హారం ద్వారానే ఆరోగ్యమైన జీవనం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ మం చి ఆరోగ్యానికి చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు ప్రధాన పాత్ర వహిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, వృక్షశాస్త్ర వుభాగాధిపతి విజయతదితరులు పాల్గొన్నారు.

***భవిష్యత్ కృత్రిమ మేదస్సుదే..***

తారా కళాశాలలో టీఎస్‌కేసీ, వాణిజ్యశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో టాస్క్ సహకారంతో కృత్రి మేదస్సు, చార్ట్ జీపీటీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎన్‌వీఎస్ఎస్ కౌండిన్యా మాట్లాడుతూ మానవ జీవనంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఒక భాగం కానున్నదని, ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ఎస్సీ హాస్టల్ తనిఖీ

జిన్నారం, అక్టోబర్ 26: మండల కేంద్రం జిన్నారంలోని ఎస్సీ హాస్టల్‌ను ప్రత్యేకాధికారి సోమేశ్వర్ శనివారం తనిఖీ చేశారు. వంట గదిలోకి వెళ్లి విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించారు. రోజువారీగా విద్యార్థులకు అందిస్తున్న మెనూను, వంట గదిలో ఉన్న బియ్యం, ఇతర ఆహార సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులు నిద్రించే గదిలోకి వెళ్లి సౌకర్యాలను, పరిసరాలను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్‌ను విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమేశ్వర్ మాట్లాడుతూ సాధారణ తనిఖీలో భాగంగానే ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎంపీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మాణిక్యం ఉన్నారు.

ఎస్సీ హాస్టల్‌లోని వంట గదిలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సోమేశ్వర్

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చౌటకూర్, అక్టోబర్ 26: మండల కేంద్రం చౌటకూర్‌తోపాటు కోర్పోలు గ్రామంలో శనివారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్వర్యంలో డీసీఎంఎస్ సూపర్‌వైజర్ వంశీగౌడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వానకాలం సీజన్‌కు సంబంధించి ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. సన్న ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దని కోరారు. కార్యక్రమంలో ఏఈవో దత్తురాజ్, కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు గౌని కిరణ్, నాయకులు కలాలి రామాగౌడ్, కైసర్, వర్కల రమేశ్, సార గోవర్ధన్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దప్పు శంకర్, పల్లె రాధాగౌడ్ పాల్గొన్నారు.

***పుల్కల్‌లో..***

పుల్కల్, అక్టోబర్ 26: మండల పరిధిలోని కోడూరు గ్రామంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముదిమాణిక్యం పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుపతి రెడ్డి, గోవర్ధన్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

చౌటకూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

సంగారెడ్డి, అక్టోబరు 26: ఉద్యోగ నోటిఫికేషన్లు ఆపి నిరుద్యోగులను మోసం చేయొద్దని, వచ్చే నెల 4న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య పిలుపునిచ్చారు. శనివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సు యాత్ర 9వ రోజు సంగారెడ్డికి చేరుకున్న సందర్భంగా పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు మల్లేశం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలపై గ్రామాల్లో చర్చ పెట్టాలన్నారు. బస్సు యాత్రలో కోచైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



మంత్రి దామోదర రాజనర్సంహకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుమ్మడిదల, అక్టోబర్ 26: గుమ్మడిదల మున్సిపాలిటీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని మంత్రి దామోదరను గుమ్మడిదల నాయకులు కోరారు. శనివారం కాంగ్రెస్ మండల నాయకులు మంత్రిని కలిసి మున్సిపాలిటీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పుట్ట నరసింహారావు, మద్ది వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

## అర్ధరాత్రి ఆటో చోరీ

హత్నూర, అక్టోబర్ 26: ఇంటి ముందు పార్క్ చేసిన ఆటో అర్ధరాత్రి చోరీకి గురైన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శనివారం బాధితుడు తెలిపిన వివరాల ప్రకా రం.. దౌల్తాబాద్‌లో నివాసముంటూ ప్రైవేట్ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్న షబ్బీర్‌అలీ ఖాళీ సమయంలో కుటుంబ అవసరాల నిమిత్తం ఆటోను కిరాయికి తీసుకొని జీవనోపాధి పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే ఆటోను ఇంటిముందు పార్క్‌చేసి ఉంచాడు. శనివారం తెల్లవారుజామున లేచి చూసేసరికి ఆటో లేకపోవడంతో ఆటో యజమానికి సమాచారం ఇచ్చి గాలింపు చేపట్టారు. ఆటో ఆచూకీ తెలియకపోవడంతో హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## తండాల అభివృద్ధికి కృషి

కోహీర్, అక్టోబర్ 26: మండలంలోని పీచెర్యాగడి పాత తండా, కొత్త తండా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సజ్జాపూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పీచెర్యాగడి తండాల్లో చేపట్టిన పలు రకాల పనులను ఆయన పరిశీలించారు. తండాల్లో పనులు అంత్యదశకు చేరాయని ఇక్కడ ముగిసిన వెంటనే కొత్తూర్, ఖానాపూర్ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయనవెంట ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు వినోద్‌రోథోడ్, గిరిజనులున్నారు.

## జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వర్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 26: జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త కమిషనర్‌గా ఉమా మహేశ్వర్‌రావును నియమిస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న మిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్‌లో పనిచేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. సహకరించిన మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రామాలయంలో కార్పొరేటర్ పూజలు

పటాన్‌చెరు, అక్టోబర్ 26: పట్టణంలోని రామాలయంలో శనివారం పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అన్నదానం చేస్తున్న మూర్తి గురుస్వామిని ఆలయ కమిటీతో కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయన్నారు. భక్తులకు అన్నదానం చేయడం పుణ్యకార్యం అన్నారు. ఆలయ అభివృద్ధికి అండగా ఉంటానని తెలిపారు.



పూజలు చేస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

## అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్ కేర్ డే

సదాశివపేట, అక్టోబర్ 26: మండల పరిధిలోని నందికంది అంగన్‌వాడీ సెంటర్-2లో శనివారం ఎండ్రీ చైల్డ్